"నాకు పెళ్ళయి అయిదేళ్ళయిందనీ, పిల్లలు పుట్టలేదనీ చెప్పాను. ఎలా ట్రీట్ చేస్తాడో చూస్తాను."

"కానీ మీకు పెళ్ళి కాలేదుగా"

"మెళ్ళో మంగళసూత్రం వేసుకుంటాను"

ఇన్‌స్పెక్టర్  ఒక్క క్షణం ఆలోచించి, "ఇందులో కూడా ఒక చిక్కు వుందనుకుంటాను. ఎంత కాదనుకున్నా అతడూ ఒక డాక్టరు. మిమ్మల్ని పరీక్షించగానే మీరు కన్య అని తెలుసుకుంటాడు."

ఆమె తలదించుకుని "నేను కన్యని కాదు ఇన్‌స్పెక్టరు గారూ ఆ మాటకొస్తే గర్భవతిని కూడా" అంది.

భైరవమూర్తి స్థాణువై చూశాడు. "అవును సర్. ఇంకో పది రోజుల్లో నా పెళ్ళి!! ఇంకా ఏమిటంటే ...... డాక్టర్ విశాల్‌కి అత్యంత సన్నిహితుడయిన రాజు అనే వ్య క్తే నాక్కాబోయే భర్త. నా గర్భానికి కారకుడు ...... ".

భైరవమూర్తి ఇంకా షాక్‌నుంచి తేరుకోలేదు.

" ...... నా బోయ్‌ఫ్రెండ్ నన్ను దాదాపు రేప్ చేశాడు. కానీ అదృష్టవశాత్తు మాపెళ్ళి కూడా నిశ్చయమైపోయింది. ప్రస్తుతం నాకు రెండోనెల అని అనుమానంగా వుంది. నాక్కాబోయే భర్త అంధుడై ఇటీవలే తిరిగి చూపు పొందాడు. డాక్టర్ విశాల్ తిరిగి అతడికి ఉద్యోగమివ్వబోతున్నాడు . వాళ్ళిద్దరి మధ్యా ఏదో ఒక రహస్య ఒప్పందం వుంది. ఆ రహస్యం ఆధారంగా రాజు ఆ డాక్టర్‌ని బ్లాక్ మెయిల్ కూడా చేస్తూ వుంటాడు. రాజు మళ్ళీ విశాల్ క్లినిక్ చేరకముందే ఆ రహస్యాన్ని పట్టుకోవాలి".

"డాక్టర్ విశాల్ మిమ్మల్ని గుర్తు పట్టడా?"

"ఒకేసారి చూశాడు. గుర్తు పట్టకపోవచ్చు ...... "

“నువ్వు చాలా రిస్క్ తీసుకుంటున్నావని నాకనిపిస్తోందమ్మాయ్”.

“లేదు ఇన్‌స్పెక్టర్‌గారూ. నా కళ్ళల్లో ఎప్పుడూ ఒకే దృశ్యం మెదుల్తూ వుంటుంది. లాయర్ శివశంకరం అనే ఒక యువకుడు తన కాళ్ళు పోగొట్టుకున్న దృశ్యం! ఒక అన్యాయాన్ని ఎదుర్కోవటం కోసం డాక్టర్ విశాల్‌తో తలపడి, అతడి క్రూరత్వానికి బలైపోయాడు. అతడు తీసుకున్న రిస్క్‌తో పోల్చుకుంటే నాది ఏ పాటిది? చూద్దాం ఆ విశాల్ నన్నేం చేయగలడో ...... ”.

“విశాల్ ఏమీ చేయలేకపోవచ్చమ్మా. ఏమీ చేయకుండా నేనెలాగూ బయట కాపలా వుంటాను. కానీ రాజు నీమీద వత్తిడి తీసుకురావచ్చు”.

“డాక్టర్ విశాల్ అరెస్ట్ అయితే రాజు మారతాడు ఇన్‌స్పెక్టర్‌గారూ! అందుకే ...... అతడు ఉద్యోగంలో చేరకముందే ఇదంతా జరిగిపోవాలి. ఈ సాలెగూడు లోంచి నాక్కాబోయే భర్తని రక్షించుకోవాలనే నా ప్రయత్నమంతా ...... ”

ఇన్‌స్పెక్టర్ భైరవమూర్తి టేబిల్‌లోంచి చిన్న టేప్‌రికార్డర్ తీశాడు. క్యాసెట్ సైజులో వుందది.

దాన్ని ఆమెకు అందిస్తూ “దీన్ని వుపయోగించండి” అన్నాడు. ఆమె దాన్ని అందుకుని లేస్తూ “థ్యాంక్సండీ! ఇలాంటి కేసులు మీరు టేకప్ చేస్తారో లేదో అని భయపడ్డాను. మీరన్నట్టు ...... ఇందులో ఏ సాక్ష్యాలూ దొరక్కపోవచ్చు. కానీ పోలీసు వ్యవస్థ మీద నాకున్న నమ్మకాన్ని బలపర్చారు ” అని వెళ్ళబోయింది.

“మనుష్యులమీద నీకున్న నమ్మకం పోకుండుగాక!” మనసులోనే అనుకున్నాడు భైరవమూర్తి ...... ఆమె వెళ్తున్న వైపే చూస్తూ.

ఆమె అందించిన రిపోర్టులన్నీ పరీక్షించాడు డాక్టర్ విశాల్. అవన్నీ బోగస్ రిపోర్టులు. ప్రహసిత్ తయారుచేయించి ఇచ్చినవి.

మధూహ మొదట్లో భయపడింది. కానీ డాక్టర్ విశాల్ ఆమెని గుర్తుపట్టినట్టు కనిపించలేదు.

“మీ భర్త తాలూకు రిపోర్టులు పరిశీలించాను. అందులో ఏ లోటూ కనిపించలేదు. మీలో కూడా ఏ లోపమూ లేదు.”

“కానీ మా వివాహం జరిగి అయిదేళ్ళు అయింది. పిల్లలు కలగలేదు” .

“మీ డేట్స్ ఎప్పుడు?”

ఆమె చెప్పింది.

“మీరు 13 ...... 14 ...... 15 రోజుల్లో రండి. అండం పరిపక్వమయ్యే రోజులవి. అప్పుడు డి అండ్ సి చేస్తాను”.

ఆమె కాస్త తటపటాయించి “డి అండ్ సి కీ పిల్లలకీ సంబంధం వుందా డాక్టర్” అంది “ఎందుకంటే రెండు సంవత్సరాలక్రితం ఒక డాక్టరు మా ఆయన రిపోర్టులు పరిశీలించి, పిల్లలు కలగటం కష్టం అని చెప్పారు”.

“మీరు అటువంటి అనుమానాలేమీ పెట్టుకోకండి. నామీద నమ్మకం వుంచండి. డాక్టర్ విశాల్ క్లినిక్‌లో చేరిన తరువాత పిల్లలు కలుగక పోవటమంటూ వుండదు. మీకు అబ్బాయి పుడితే విశాల్ అని పేరు పెట్టుకోవాలి సుమా” నవ్వేడు.

“అమ్మాయి పుడితే విశాలి అని కూడా పెట్టుకుంటాము. ఇన్నాళ్ళకి మాకో వెలుగురేఖ కనపడింది. మీ ఫోటో కూడా బెడ్‌రూమ్‌లో పెట్టుకుంటాం. మా ఇంట్లో జ్యోతి వెలిగించబోతున్నారు. ఎల్లుండే నా పదమూడోరోజు. ఎల్లుండి వస్తాను” అంటూ లేచింది.

ఆమె వెళ్ళిపోయాక విశాల్ రాజుకి ఫోన్ చేశాడు “ఇపుడే ఒక కేసు వచ్చింది. ఎల్లుండి రమ్మన్నాను. నువ్వు వస్తావా?” అని.

“వస్తాను. అయితే ఎల్లుండినుంచీ నేను ఉద్యోగంలో చేరుతున్నట్టేగా.”

“చేరుతున్నట్టే. మొదటి కేసు ఇదే.”

భైరవమూర్తి ఆమెకు ఒక చిన్న స్విచ్ లాటిది ఇచ్చాడు. “ఏదన్నా అపాయం అనిపిస్తే ఈ బెల్ నొక్కు. నేను క్లినిక్ బయట వుంటాను. టేప్‌లో ఈ సంభాషణ అంతా రికార్డ్ చేయటం మర్చిపోక ...... ”

ఆమె అక్కణ్ణుంచి బయల్దేరి విశాల్ క్లినిక్‌కి వచ్చింది.

భైరవమూర్తి మోటర్‌సైకిల్‌మీద ఆమె వెనుకే బయల్దేరాడు.

ఆమె గుండె వేగంగా కొట్టుకొంటోంది, వణుకుతూన్న కాళ్ళతో క్లినిక్ లోకి అడుగుపెట్టింది.

భైరవమూర్తి వీధి మొదట్లో ఆగిపోయాడు.

ఆమెకు భయం వేసింది. అయితే ఆ భయం ...... తనకే మయినా జరుగుతుందని కాదు. ఇంత చేసినా విశాల్‌కి కోర్టులో శిక్ష పడదేమోనని!! ఏ సాక్ష్యమూ దొరకదేమోనని ......

అసలు ఇప్పుడేం జరుగుతుంది?

...... నర్సు ఆమె బట్టలు తీస్తుండగా కూడా ఇదే ఆలోచన. ఆమెకి గౌను తొడిగింది నర్సు. నిర్వికారంగా తన పనులు చేసుకుపోతోంది. ప్యూబిక్ హేర్ తీసేసింది. ఆపరేషన్ టేబిల్‌మీద పడుకోబెట్టింది.

అప్పుడు ప్రవేశించాడు డాక్టర్ విశాల్. చేతులకి గ్లవుస్ తొడుక్కుని వున్నాడు. మధూహని చూసి పలకరింపుగా నవ్వాడు.

ఆమె మోచేతి దగ్గిర పట్టుకుని ఐ.వి. ఇంజెక్షన్ ఇవ్వటం ప్రారంభించాడు. “ ఏమిటది డాక్టర్?” మామూలుగా అడిగినట్టు అడిగింది.

“కంపోజ్”

మధూహపై ఆకాశం విరిగిపడినట్టు అయింది.

కం ...... పో ...... జ్.

అంటే ...... తను కొద్దిక్షణాల్లో మత్తులోకి జారిపోబోతోంది ...... తరువాత ఏం జరిగింది తనకి తెలీదు! నర్సుకి తెలియకుండా కవర్ క్రింద దాచిన స్విచ్ నొక్కలేదు.

అన్నిటికన్నా ముఖ్యంగా ...... రికార్డు చేయటానికి సంభాషణేమీ వుండదు.
ప్రాణాలకు తెగించి ఇంత చేసిందీ వృథా అయిపోతోంది ......

"ఇంకో ఇంజెక్షన్ అవసరం లేదులే" ఆమెనే పరీక్షగా చూస్తున్న విశాల్ అన్నాడు. నర్సు వెళ్ళిపోయింది.

ఆమె కాళ్ళు పైకి మడతపెట్టి గౌను పైకి లాగాడు విశాల్. చేతిలోకి సిరెంజి తీసుకున్నాడు. అది మామూలు సిరెంజి కాదు. వెటర్నరీ సిరెంజిలా వుంది. సూది లేదు. దాని స్థానే పొడవాటి సన్నటి గొట్టం వుంది. ఒక చిన్న సైజు పిచికారీలా వుంది.

మధూహ మనసుతో పోరాడుతోంది. మనిషి మత్తులోకి జారుకోవటానికి ఒక ఇంజెక్షన్ చాలు. అది చాలకపోతే రెండోది ఇస్తాడు. ఆ విషయం మధూహకి తెలుసు. అందుకే మొదటి దానికే తల వాల్చేసింది. నిద్ర కమ్మేస్తోంది.

ఆమె మనసుతో తీవ్రంగా పోరాడుతోంది. మైకం కమ్మకుండా వుండటంకోసం నరాల్తో ఘర్షిస్తోంది!

"నాకు నిద్ర రాకూడదు. మైకం కమ్మకూడదు" అని పదే పదే అనుకుంటోంది.
అంత విపత్కర పరిస్థితిలోనూ ఆమెకు నవ్వొచ్చింది. ఏ హిప్నాటిజానికి వ్యతిరేకంగా ఇంతకాలం పోరాడుతూ వచ్చిందో, ఇప్పుడూ దాన్నే ఆశ్రయిస్తోంది! సెల్ఫ్ హిప్నాటిజం ద్వారా భౌతికమైన శారీరక అవస్థను అధిగమించటానికి ప్రయత్నిస్తోంది!!

హిప్నాటిజం!! ...... అదెప్పుడూ గొప్పదే.

కానీ దానిసాయంతో అన్ని రోగాల్ని నయం చేస్తామనే మోసగాళ్ళ చేతిలో పడి అస్తిత్వం కోల్పోతోంది.

ఇంతలో బాత్‌రూమ్ తలుపు చప్పుడయింది.

మధూహ కళ్ళు మూసుకుపోతున్నాయి. బలవంతం మీద కళ్ళు విప్పి అతడిని చూడటానికి ప్రయత్నించింది. కళ్ళముందు మసగ్గావున్న అతడి రూపు క్రమంగా స్పష్టం కాసాగింది!

రాజు!!

ఆతడు రాజు!!

ఈ పరిణామాన్ని ఆమె వూహించలేదు.

రాజు ఆమెని గమనించలేదు. పేషెంటు ఎవరయినదీ తనకి సంబంధం లేనట్టు డాక్టర్ విశాల్‌కి తన చేతిలో గిన్నె అందించాడు. విశాల్ ఆ గిన్నెలో ద్రవాన్ని సిరెంజిలోకి ఎక్కిస్తున్నాడు. రాజు అలిసిపోయినట్టు వున్నాడు. బాత్‌రూమ్‌లోంచి రావటం వలన చొక్కా తడిసిపోయింది.

రాజు లోపల్నుంచి తీసుకొచ్చిందేమిటో ఆమెకి అర్థమైంది.

స్పెర్మ్!!

అతడి వీర్యం!!!

13 ...... 14 ...... 15

రహస్యం ఆమెకి అర్థమైపోయింది.

స్త్రీ అండం పరిపక్వమైన దశలో, 13 ...... 14 ...... 15 రోజుల్లో కలుసుకోవటానికి డాక్టర్ విశాల్ ఎందుకు రమ్మంటాడో తెలిసింది. డాక్టర్ విశాల్ క్లినిక్‌లో యాభైశాతం స్త్రీలు ఎలా గర్భవతులవగల్గుతున్నారో అవగాహనకొచ్చింది.

భర్త స్పెర్మ్‌ని ఇంటి వద్దనుంచి తీసుకురమ్మని చెప్పి, దాన్ని పారబోసి, తన కాంపౌండర్ వీర్యాన్ని ఎక్కిస్తున్నాడని కూడా అర్థమైంది. తన క్లినిక్‌లోనే "పరీక్ష" పేరుతో (డి అండ్ సి ) చేస్తున్న మోసం బహిర్గతమైంది.

ఈ లోపులో డాక్టర్ విశాల్ సిరెంజి పట్టుకుని ఆమెవైపు తిరిగాడు. అప్పటికే ఆమె కాళ్ళు మామూలుగా జరుపుకుని, కాళ్ళు క్రిందికి జార్చేసింది.

ఆమె పడుకున్న భంగిమలో మార్పు రావటం చూసి అతడు రాజుతో "ఈమెని సరిగ్గా సర్దు" అన్నాడు.

విశాల్ వెనుకనుంచి ముందుకొచ్చిన రాజు ఆమెని చూసి సన్నగా కేక పెట్టాడు "ఈమె ...... ఈమె ...... నాక్కాబోయే భార్య"

విశాల్ మొహం చిట్లించి "ఏమిటీ?" అన్నాడు అర్థం కానట్టు.

క్లినిక్‌కి వచ్చినప్పటినుంచీ మధూహ ...... తన దగ్గిరున్న టేప్ రికార్డర్ ఆన్ చేసే వుంచింది.

విశాల్ అంటున్నాడు ......"ఈమె డేంజరస్ అని నీకారోజే చెప్పాను. వినలేదు నువ్వు. తనకి పెళ్ళయి అయిదేళ్ళు అయిందనీ, పిల్లలు పుట్టలేదనీ చెప్పింది."

"ఏం సాధిద్దామని చెప్పి వుంటుంది?"

"ఇక్కడ జరిగేదేమిటో తెలుసుకోవటం కోసం" అన్నాడు డాక్టర్. " ...... మనం కాంపోజ్ ఇంజెక్షన్ ఇస్తామని వూహించివుండదు బహుశ. అయినా ఈమె చాలా ప్రమాదకరమైన వ్యక్తి రాజూ. ఎలాగయినా వదిలించుకో."

"అవును. ఇప్పుడు వదిలించుకోక తప్పదు. నా కళ్ళు పోయినప్పుడు ఎవరో ఒకరి ఆసరా కావాలనిపించింది. ఉద్యోగం కూడా లేదు. అందుకని ఈవిడ మీద ఆధారపడవలసి వచ్చింది."

మధూహకి లోపల్నుంచి దుఃఖం తన్నుకువస్తోంది. మనుష్యులపట్ల ఆమె పెంచుకున్న నమ్మకాన్ని సమూలంగా నాశనం చేస్తున్నాడు ఆమె ప్రియుడు.

మనిషిలో ఇంత అవకాశవాదం, కృత్రిమత్వం వుంటుందని మొదటిసారి తెలుసుకొంటోంది! ఇతడే ఒకప్పుడు అంధుడై ...... తన వళ్ళో పడుకుని "నువ్వు లేకపోతే నాకు దిక్కెవరు?" అంటూ విలపించాడు.

ఇప్పుడు తన దుఃఖం ...... అతడు మోసం చేసినందుకుకాదు. అంత అమాయకంగా తను రెండుసార్లు మోసపోయినందుకు.

"నాకు తనకి ప్రెగ్నెన్సీ అన్న అనుమానమని చెప్పిందే ...... " రాజు సాలోచనగా మధూహవైపు చూస్తూ అన్నాడు.

"బహుశ నిన్ను ట్రాప్ చేయటానికి చెప్పి వుంటుంది".

మధూహ ...... బయటవున్న ఇన్‌స్పెక్టర్‌కి సూచనలిస్తున్నట్టు కాలింగ్‌బెల్ కొట్టింది. ఆమె కళ్ళు విప్పటం మొదటగా చూసినవాడు రాజు.

అంతసేపూ మత్తులోనే వుందనుకున్నాడు.

" ఏమిటిది? " గద్దించాడు.

మధూహ జీవంలేని నవ్వుతో " ...... ఇంతకాలం మీరు చేస్తున్న మోసం ఏమిటో తెలుసుకోవటానికి చేసిన ఆఖరిప్రయత్నం " అంది.

" భార్యాభర్తల్ని పూర్తి పరీక్షలు చేయకుండానే కేవలం 13 ...... 14 ...... 15 రోజుల్లో రమ్మని ఎలా సంతానవంతుల్ని చేస్తారో తెలుసుకున్నాను ...... "